క్లుప్తంగా

బట్టీల్లో పనిచేసినా ఓటు వేయడం మరువొద్దు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: ఎక్కడ పనిచేశామని కాదు.. ఓటు వేశామా, లేదా అన్నదే ప్రధానమన్నట్లు ఓటర్లలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చైతన్యం తీసుకొస్తున్నారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా గురువారం చిత్తూరులోని సాంబయ్యకండ్రిగ వద్ద ఉన్న ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఓటర్లకు అవగాహన కల్పించారు. చేసేది ఏ పనైనా పోలింగ్ రోజున కచ్చితంగా బూత్‌కు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈవీఎంలు పనిచేసే తీరు, వీవీ ప్యాట్ గురించి స్వీప్ సహాయ నోడల్ అధికారి చిన్నయ్య వివరించారు.

మిట్టపల్లెలో మహాభారత ఉత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణం

బంగారుపాళెం: మండలంలోని మిట్టపల్లెలో గురువారం మహాభారతం ప్రారంభమైంది. ద్రౌపదీ దేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా 18 రోజుల పాటు హరికథా కాలక్షేపం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రుల్లో వీధి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. సర్పంచ్ రమేష్, రాజేశ్వరి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.

వెస్ట్ సీఐకి అవార్డు



రవిశంకర్‌రెడ్డి

యాదమరి(ఐరాల): చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డికి డీజీపీ కామిడేషన్ డెస్క్ అవార్డు లభించింది. సీఐ రవిశంకర్‌రెడ్డి గతంలో అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో చీటింగ్, చోరీ కేసుల్లో ఛేదించి ప్రాపర్టీలను రికవరీ చేయడంతో ఆయనకు గురువారం డీజీపీ కామిడేషన్ డెస్క్ అవార్డు లభించింది. ఆయనకు సహచర పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

–ఒకరికి తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్) గాయపడిన మహేష్

తవణంపల్లె: లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పట్నం సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెనుమూరు మండలంలోని అలుగూరుపల్లెకు చెందిన సి.సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు మహేష్(45) మారుతి బ్రీజర్ కారులో తిరుపతి నుంచి బెంగళూరుకు వెళుతున్నాడు. పట్నం సమీపంలో కారులో వెళుతుండగా ముందు వెళుతున్న లారీని అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మహేష్ తలకు తీవ్రగాయమైంది. గాయపడ్డ అతన్ని వేలూరులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.

సూర్యప్రభ వాహనంపై విహారం



పుర వీధుల్లో విహరిస్తున్న స్వామివారు

గుడుపల్లె: మండలంలో కనమనపల్లెలోని శ్రీ శ్రీనివాసస్వామి ఆలయంలో గురువారం సూర్యప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా పద్మావతి శ్రీనివాసస్వామికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేద పండితులు స్వామివారిని సూర్యనారాయణుడు అలంకరణతో ముస్తాబు చేసి, మంగళవాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ, పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

సంక్షేమ పాలనకు ప్రజాశీస్సులు



ఎన్నికల ప్రచారంలో విజయానందరెడ్డి



కుండను తయారు చేస్తున్న విజయానందరెడ్డి

- చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి

గుడిపాల: జగన్ సంక్షేమ పాలనకు ప్రజాశీస్సులు మెండుగా ఉన్నాయని చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. తమ కుటుంబాలకు, పిల్లలకు, ఆడబిడ్డలకు మంచి జరిగిందని, జగనన్నను తప్పకుండా ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలే చెబుతున్నారన్నారు. గురువారం ఆయన ఏఎల్‌పురం పంచాయతీలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు మంచి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను గమనించాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు.

మోసం చేయడమే చంద్రబాబు అజెండా..

రాజకీయ మనుగడ, అధికారం కోసం బీజేపీ–జనసేనతో పొత్తు పెట్టుకుని ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విజయానందరెడ్డి ధ్వజమెత్తారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయన ప్రజలకు ఎటువంటి మేలు చేయలేకపోయారన్నారు. జనరంజక జగన్ పాలనలో చంద్రబాబుకు దిక్కుతోచడం లేదన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని, ప్రజలు వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్ని పార్టీలు ఏకమైనా, ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు నవీన్, రజనీకాంత్, మధుసూదన్‌రాయల్, రమేష్, విక్టర్, ఎంపీటీసీలు సామ్యేల్, యోహాన్, నేతలు ప్రసాద్, యుగంధర్, శిలంబరసన్, రమణ, గుండుసాయి, సాయిక్రిష్ణ, డానియల్, ప్రేమ్‌కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం: మండలంలోని 197రామాపురం పంచాయతీలో శుక్రవారం ఉదయం 7గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జనార్దన్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థివిజయానందరెడ్డి హాజరవుతారని, మండలంలోని పార్టీ శ్రేణులు తప్పకహాజరు కావాలని కోరారు.

పాండవ మధ్యముడిలా గెలిపించండి



సునీల్‌కుమార్‌ను సన్మానిస్తులు నేతలు

- పూతలపట్టు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

పూతలపట్టు: కురుక్షేత్ర యుద్ధంలో పాండవ మధ్యముడైన అర్జునుడు విజయం సాధించిన విధంగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని యం.బండపల్లిలో జరుగుతున్న నాల్గవరోజు మహాభారతంలో ఆయన పాల్గొన్నారు. స్వామివారికి పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకుడు బాబురెడ్డి, నేతలు జగదీశ్వర్‌రెడ్డి, కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నేతలు త్యాగరాజులు, గోవిందరాజులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించండి

–అధికారులను ఆదేశించిన కలెక్టర్ షణ్మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంప్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి నివేదికలను సోమవారంలోపు పంపాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణతో పాటు ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. పటిష్ట ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఉన్న బోర్ల నుంచి నీటిని సరఫరా చేయాలన్నారు. నాడు నేడు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో బోర్లు ఉన్నాయని, అక్కడ నుంచి నీటిని వినియోగించుకోవాలని తెలిపారు. బోర్ల మెకానిక్‌లు లేని చోట వెంటనే నియమించుకోవాలన్నారు. 250కి పైగా మండలాల్లో బోర్లు ఉన్నట్‌లెతై ఇద్దరు మెకానిక్‌లను నియమించాలని తెలిపారు. ఇరిగేషన్ చెరువులలో పశువులకు నీటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఓల్టా చట్టం పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో చిత్తూరు ఆర్‌డీఓ శ్రీనివాసులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

–రిటర్నింగ్ అధికారి చిన్నయ్య

పూతలపట్టు: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్డీఓ) చిన్నయ్య తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రచారంలో భాగంగా ప్రచార వాహనాలకు అనుమతిని తీసుకోవాలని తెలిపారు. అనుమతులు లేకుండా పబ్లిక్ ప్రదేశాలలో శబ్దం చేస్తూ తిరిగితే వాహనాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. అనుమతి తీసుకున్న ఒరిజినల్ కాపీని వాహనాల ముందు భాగంలో అతికించాలని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే అనుమతులని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి కూడా ఆర్వో వద్ద అనుమతులు తీసుకోవాలని తెలిపారు. బహిరంగ సభలు, పార్టీ సమావేశాలు నిర్వహించినప్పుడు ఫ్లయింగ్ స్క్వాడ్ హాజరై ఖర్చులు రాస్తారని తెలిపారు. బంగారుపాళ్యం (కొదలమడుగు), యాదమరి (కనికాపురం) వంటి రెండు చెక్‌పోస్టుల వద్ద 3 షిఫ్టులతో సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

నిర్లక్ష్యం వహించకండి..

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి చిన్నయ్య తెలిపారు. ఉదయం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లి, యాదమరి మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

తవణంపల్లె: అనారోగ్యంతో బాధపడుతూ విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ ఘటన పుణ్యసముద్రంలో గురువారం చోటుచేసుకున్నట్లు తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పుణ్యసముద్రంకు చెందిన ఎం. కనకరాజ(57) అనారోగ్యంతో చాలా కాలంగా బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆ బాధ తాళలేక జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గుడ్ ఫ్రైడే

చిత్తూరు రూరల్: నగరంలోని పలు చర్చిలు గుడ్‌ఫ్రైడే వేడుకలకు సిద్ధమయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు, గుడ్‌ఫ్రైడేకు సంబంధించి మత పెద్దలు ప్రసంగించనున్నారు. అనంతరం క్రైస్తవులు ఉపవాస దీక్షలు విరమించనున్నారని మత పెద్దలు పేర్కొన్నారు.

శోభారాజ్ సేవలు ఆదర్శనీయం



శోభారాజ్‌ను సన్మానిస్తున్న భూమన్, శతావధాని మురళి

పుత్తూరు: సంగీత, సాహిత్యంలో శోభారాజ్ సేవలు అభినందనీయమని టీటీడీ శ్వేత సంచాలకులు భూమన్ తెలిపారు. ఆమెను గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇందులో భూమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శోభారాజ్ చెన్నైకి చెందిన ఇకాస్ టెక్నాలజీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే తమిళ, తెలుగు రాష్ట్రాల్లో ప్రజాసేవలో తరిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ధనం, దానం, భోగం, వైరాగ్యం లక్షణాలతో శోభారాజ్ ప్రకాశిస్తున్నారని కొనియాడారు. ప్రకృతితో మమేకమైతే వయస్సు గుర్తుకు రాదన్నారు. ప్రతి వ్యక్తీ తన చివరి శ్వాస వరకు వృద్ధాప్యం గురించి ఆలోచించరాదని సూచించారు. సన్మాన గ్రహీత సి.శోభారాజ్ మాట్లాడుతూ పుత్తూరులో 2004 నుంచి రెండు దశాబ్దాల పాటు విశ్రాంత ఉద్యోగులు సంఘటితంగా చేస్తున్న విద్య, వైద్యం, సంగీతం, సాహిత్యం తదితర పలు సేవా కార్యక్రమాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని చెప్పారు. వృద్ధాప్యంలోనూ సంఘం సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. తనకు పుత్తూరు పట్టణంతో ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. ఈ సందర్భంగా సంఘం భవనం అభివృద్ధికి రూ.5 లక్షలు విరాళమిచ్చారు. కార్యక్రమంలో శతావధాని అముదాల మురళి, తిరుపతి సంస్కార ఫౌండేషన్ ప్రతినిధులు రాకేష్‌కుమార్, శ్రీనివాసమూర్తి, సంఘం నాయకులు గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



- ఇఫ్తార్ విందులో విజయానందరెడ్డి

స్థానిక గంగనపల్లిలోని మసీదులో గురువారం ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి హాజరై ముస్లింలతో పాటు విందు చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు, నేతలు పాల్గొన్నారు.

–చిత్తూరు రూరల్

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రష్మిత అన్నారు. వెంగమాంబపురం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యసిబ్బంది కవిత, రీటా, కార్లిమా, స్వర్ణలత పాల్గొన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం



పత్రపల్లెలో వైద్య పరీక్షలు

తవణంపల్లె: నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం పత్రపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమె సేవలు ప్రశంసనీయం



సీహెచ్‌ఓ దంపతులను సన్మానిస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ షమీమ్ మున్నీషాబేగం సేవలు ప్రశంసనీయమని పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ అన్నారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న సీహెచ్‌ఓ షమీమ్ మున్నీషా బేగంను గురువారం పీహెచ్‌సీ ఆవరణలో డాక్టర్లు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. సీహెచ్‌ఓ దంపతులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఐరన్ మాత్రలను మింగిస్తున్న వైద్య సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ నార్త్ పాఠశాల విద్యార్థులకు స్థానిక ఆరోగ్య వైద్యశాఖ సిబ్బంది గురువారం ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. సబ్ యూనిట్ అధికారి జయశంకర్ మాట్లాడుతూ, పిల్లలు ప్రతి గురువారం భోజనం చేసిన తర్వాత ఈ మాత్రలను మింగాలని, వీటి వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం, రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ బడుల్లో మాత్రల పంపిణీ వందశాతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది అముద, రమాదేవి, శాంతి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు



స్థానికులతో మాట్లాడుతున్న ఇందుమతి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని చిత్తూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి తెలిపారు. గురువారం స్థానిక 10వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. సంక్షేమ పాలన కావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయానందరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.


పల్లెల్లో కేంద్ర బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పెనుమూరు(కార్వేటినగరం): ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్రబలగాలు, పోలీసు బలగాలతో కలసి పెనుమూరు మండలంలోని గుడ్యాణంపల్లె, గౌడుగుమానిపల్లె, కలవకుంట గ్రామాల్లో గురువారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా చిత్తూరు తూర్పువిభాగం సీఐ కుళ్లాయప్ప మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కేంద్ర బలగాలు వచ్చాయని, కవాతు ప్రదర్శన ముఖ్యఉద్దేశం ప్రజల్లో ఎన్నికల నిర్వహణపై నమ్మకం, ఆత్మవిశ్వాసం నింపడానికేనని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, విచ్ఛిన్నకర శక్తులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికలపై ప్రజలు ఎలాంటి అనుమానాలు వద్దని, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. నిర్భయంగా ప్రజలందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్‌ఐ లోకేష్ పాల్గొన్నారు.

జాతర నిర్వహణకు సహకరించండి



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

పుంగనూరు: పట్టణంలో శ్రీసుగుటూరు గంగమ్మ జాతరను పకడ్బందీగా, ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు. గురువారం మున్సిపాలిటీలో సచివాలయ ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 2, 3వ తేదీలలో నిర్వహించనున్న జాతరకు సంబంధించి పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, మంచినీటితో పాటు చలువ పందిళ్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక సిబ్బందితో పారిశుధ్యం మెరుగు పరుస్తామన్నారు. సీఐ రాఘవరెడ్డి మాట్లాడుతూ, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. చోరీలకు అడ్డుకట్ట వేసే దిశగా మఫ్టీలో పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. పట్టణంలోకి భారీ వాహనాలను అనుమతించకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు. ప్రజలు జాతరను జయప్రదం చేసేందుకు సహకరించాలని కోరారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, మెడికలాఫీసర్ డాక్టర్ రంజిత, డీఈఈ మహేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.